ఎండల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

• మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే బీరం వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎన్నికల సిబ్బంది

కొల్లాపూర్ రూరల్, మే 6 : ఎండల తీవ్రత దృశ్య ప్రజలు స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎండల తీవ్రత దాదాపు 46డిగ్రీల వరకు వస్తోందని ఇలాంటి సమయంలో డీ హైడ్రేషన్ లాంటి సమస్యలు వస్తాయన్నారు. వీలైనంత వరకు వడగాలులకు, ఎండల తీవ్రతకు దూరంగా ఉండాలన్నా రు. మంచినీళ్లు ఎక్కువగా తాగాలన్నారు. పం డ్ల జ్యూస్, నిమ్మరసం, కొబ్బరి నీళ్లను తీసుకోవాలని సూచించారు. తప్పని పరిస్థితిలో బయటకు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆ యన పేర్కొన్నారు.

బీరం వాహనం తనిఖీ

కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి వాహనాన్ని సోమవారం సింగోటం చౌరస్తాలో ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల సిబ్బంది తనిఖీ చేశారు. ఎన్నికల సిబ్బందికి బీరం సహకారం అందించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు తన సహకారం ఉంటుందన్నారు. అలాగే స్పోర్ట్స్ అథార్టీ చైర్మన్ ఆంజనేయగౌడ్ వాహనాన్ని కూడా తనిఖీ చేశారు.

ఎంపీగా మల్లురవిని గెలిపించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేశ్

• ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

తిమ్మాజిపేట, మే 6 : నాగర్‌కర్నూల్ అభివృద్ధి చెందాలంటే ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని గెలిపించాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డితో ఎమ్మెల్యే కలిసి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గడపకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వెళ్లి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు గెలుపోందామని, ఎంపీగా మల్లు రవి గెలిస్తే మరిన్ని నిధులు వస్తాయని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం బుధసముద్రం మాజీ ఎంపీటీసీతోపాటు పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

తల్లినిమించిన దైవం లేదు..

కల్వకుర్తి రూరల్, మే 6 : ఈ సృష్టిలో తల్లి ప్రేమను వెలకట్టలేమని అమ్మను మించిన దైవం లేదని సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు, బాలవికాస్ నిర్వాహకులు అన్నారు. పట్టణంలోని షిర్డీసాయి, సత్యసాయి ప్రశాంతి సన్నిధిలో సోమవారం సత్యసాయి మాతృమూర్తి వర్ధంతిని పురస్కరించుకుని ఈశ్వరమ్మ డే కార్యక్రమంలో భాగంగా బాలవికాస్ విద్యార్థులచేత నిర్వాహకులు మాతృపూజా దినోత్సవాన్ని నిర్వహించారు.

గ్రామీణ క్రీడాకారులకు తోడ్పాటునందిస్తా

• ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి

క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న గోళి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ, మే 6 : గ్రామీణ క్రీడాకారుల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తానని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రాచూర్ గ్రామంలో రాచూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన పరిశీలించారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను అభినందించారు. గ్రామస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి పార్టీలకతీతంగా కారుగుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్టారాంరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ అనిల్‌కుమార్, ఎంపీటీసీ గుత్తి వెంకటయ్య, రాఘవేందర్‌రెడ్డి, సుధీర్ ఉన్నారు.

కాంగ్రెస్‌కు ఓట్లడిగే నైతిక హక్కులేదు

కల్వకుర్తి రోడ్‌షోలో తమిళ నాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై..

రోడ్‌షోలో మాట్లాడుతున్న అన్నామలై

కల్వకుర్తి రూరల్, మే 6 : ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కుఅడిగే నైతిక హక్కులేదని తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై అన్నారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలో నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా నిర్వహించిన రోడ్‌షో కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ,బీసీ రిజర్వేషన్‌లు రద్దు చేస్తారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధపు మాటలు చెబుతున్నారని ఆయన విమర్శించారు. సోమశిలవద్ద కేబుల్‌బ్రిడ్జి ఏర్పాటు, దేశంలో అన్నిరహదారుల విస్తరణ, 3సంవత్సరాలు నిరుపేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేసింది ప్రధానిమోదీ నాయకత్వంలోని బీజేపీ అని గుర్తు చేశారు. అంతకుముందు కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ రాములు, నాయకులు సుధాకర్‌రావు, రఘునందన్‌రెడ్డి, ఆచారి, పలువురు తదితరులు ఉన్నారు.

కన్యాతండాలో ఈదురు గాలి బీభత్సం

• ఎగిరిపోయిన ఇంటిపైకప్పులు, విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

పడిపోయిన ఇంటి పైకప్పు

అచ్చంపేట/ అచ్చంపేట రూరల్, మే 6 : వేసవిలో ఈదురు గాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఆదివారం రాత్రి పెద్దఎత్తున ఈదురుగాలి రావడంతో అచ్చంపేట మండలం కన్యాతండాలో కేతావత్ రూప్‌సింగ్, కేతావత్‌మోతి, కేతావత్ హన్మ లకు చెందిన ఇంటిపై కప్పు రేకులు కూలి కిందపడ్డాయి. కేతావత్ సామ్య ఇంటిపై విద్యుత్‌స్తంభం విరిగిపడింది. దీంతో తండావాసులు రాత్రి మొత్తం కరెంటు లేకపోవడంతో చీకట్లో గడిపారు. కొన్ని చోట్ల చెట్లుపడి పోయాయి. అధికా రులు ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలే..

- ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం
- కొండెక్కిన నిత్యావసర సరుకుల ధరలు
- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి, మే 6 : కాంగ్రెస్ పార్టీని మరోసారి నమ్మితే కష్టాలు తప్పవని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గుడ్లనర్వ, ఖానాపూర్, పోలేపల్లి, వడ్డెమాన్, సల్కర్‌పేట గ్రామాల్లో పార్లమెంట్ ఎ న్నికల్లో భాగంగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రేవంత్‌రెడ్డి దేవుడిపై ఒట్టుపెట్టి ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు కొండెక్కాయని, నీళ్లు, కరెంటు సక్రమంగా లేక ప్ర జలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుబంధు, దళితబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, పింఛన్లు అ మలు చేయడం లేదని విమర్శించారు. ఈనెల 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఆర్‌ఎ స్ ప్రవీణ్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపిస్తే కాంగ్రెస్ మెడలు వం చి హామీలు అమలయ్యేలా చూస్తారని పేర్కొన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15వేల రైతుబంధు, కల్యాణలక్ష్మికి తులం బంగారం, రూ.500 సిలిండర్ ఏమయ్యాయని ప్ర శ్నించారు. కాంగ్రెస్‌ను నిలదీయాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్‌పీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, పులేందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రచారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి

నమ్మించి మోసం చేసిన సర్కారు

పంజుగులలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు గణేశ్

కల్వకుర్తి, మే 6 : పేదల గొంతుకైన బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను బలపరుస్తూ కారుగుర్తుకు ఓటు వేయాలని కోరుతూ సోమవారం కల్వకుర్తి మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నమ్మించి మోసం చేసిందని వివరిస్తూ బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఓట్లు వేయాలని కోరారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తేనే పేదల కష్టాలు తొలగుతాయని ఓటర్లకు వివరించారు. నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మండలంలోని పంజుగులలో బీఆర్‌ఎస్‌వీ మండలాధ్యక్షుడు గణేశ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి ప్ర చారం నిర్వహించారు. కారుగుర్తుకు ఓటు వే యాలని కోరారు. అదే విధంగా గుండూర్ గ్రా మంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సూ ర్యప్రకాశ్‌రావు ఆ ధ్వ ర్యంలో బీఆర్‌ఎస్ నా యకులు, కార్యకర్త లు ఇంటింటి ప్రచారం ని ర్వహించారు. ఉపాధి కూలీలు పనిచేస్తున్నా చోటుకు వెళ్లి కారుగుర్తుకు ఓటు వే యాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చేస్తున్నా మోసాలను కూలీలకు వివరించారు.

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించండి

వెల్దండ, మే 6 : కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని సింగిల్‌విండో డైరెక్టర్లు శేఖర్ ముదిరాజు, నాగులునాయక్‌లు అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్, కుప్పగండ్ల, కేస్లీతాండ, మర్రిగుంతతాండ, చొక్కన్నపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా.. కారుగుర్తుకు ఓటేసి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. బీఆర్‌ఎస్ గెలిస్తేనే ఈ ప్రాంతం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ అంజీనాయక్, కొండల్, శంకర్, మధుసూదన్‌రెడ్డి, యాదగిరి, శ్రీను, జోగయ్య, మల్లేశ్, రవి ప్రభాకర్, సాయిలు ఇతరులున్నారు.

ప్రశ్నించే గొంతును ఆదరించండి

చారకొండ, మే 6 : పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకను ఆదరించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, సీనియర్ నేత గజ్జెయాదయ్యగౌడ్, నేతలు సలీం, రమేశ్, తన్నీరు రామకృష్ణ, శ్రీశైలం, చండీశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

తిమ్మాజిపేట, మే 6 : తిమ్మాజిపేట మండలం మారేపల్లిలో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా నాయకులు ప్రచారం చేస్తూ కారు గుర్తుకు ఓటువేసి ఆర్‌ఎస్‌పీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు జోగుప్రదీప్, పరందాములుగౌడ్ పాల్గొన్నారు.

నేడు ఆర్‌ఎస్‌పీ ప్రచారం

కొల్లాపూర్ రూరల్, మే 6 : బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని వీపనగండ్ల, నాగర్‌కర్నూల్ టౌన్, తెలకపల్లి మండలాల్లో పర్యాటన ఉంటుందని ఎంపీ అభ్యర్థి పీఆర్‌వో మల్లికార్జున సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు వీపనగండ్లలో రోడ్‌షో, మధ్యా హ్నం 12గంటలకు జిల్లా పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం ఉంటుందని, అనంతరం సాయంత్రం 6గంటలకు తెలకపల్లిలో రోడ్‌షో ఉంటుందన్నారు.

వంగూరులో..

వంగూరు, మే 6 : నాగర్‌కర్నూల్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి డా.ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ నేత సత్యం ఓటర్లను కోరారు. సోమవారం మండలంలోని సర్వారెడ్డిపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఆర్‌ఎస్‌పీని గెలిపించాలి

పెద్దకొత్తపల్లి, మే 6: ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమా ర్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ కార్యకర్తలు గ్రామాల్లో ప్రచా రం చేపట్టారు. సోమవారం మండలంలోని ముష్టిపల్లి గ్రా మంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వ హించి మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధిని ఓటర్లకు తెలియజేస్తూ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్‌పీని గెలిపించాలని కోరారు.

గుండూర్‌లో ప్రచారంలో పాల్గొన్న సూర్యప్రకాశ్‌రావు

వెల్దండ: పెద్దాపూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

మారేపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలి

- **ఎన్నికలకు సర్వం సిద్ధం చేయాలి**
- **కలెక్టర్ ఉదయ్‌కుమార్**

కల్వకుర్తి రూరల్, మే 6 : మే 13న జరిగే ఎన్నికలకు సం బంధించి సర్వం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం కల్వకుర్తి ప ట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం మిషనింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ వీఎం స్ట్రాంగ్‌రూంలో ఏర్పాటు చేసిన మిషనింగ్ ప్రక్రియ ను పూర్తిస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సలహాలు సూచనలు చేశారు. బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్, బ్యాలెట్ పేపర్, ఈవీఎంలో అభ్యర్థులకు కేటాయించిన గుర్తులను అమర్చిన విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. 13న జరిగే ఎన్నికల్లో తప్పిదాలకు పొరపాట్లకు అవకాశం కల్పించకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వారిగా మిషనింగ్ ప్రక్రియను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల రోజున ఉదయం 5:30గంటలకు మాక్‌పోలింగ్ నిర్వహించాలని అదేవిధంగా 17సీ, పీవోడైరీని తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. పోలింగ్‌కేంద్రంలో అధికారులకు ఎలాంటి తప్పిదాలకు అవకాశం కల్పించొద్దన్నారు. గ్రామాల్లో ఓటర్లందరిరి పోలింగ్‌స్లిప్‌ల పంపిణీ గురించి ఏఆర్‌వో శ్రీనును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కల్వకుర్తిలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేం ద్రాన్ని సందర్శించి ఓటింగ్‌ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

ఈవీఎంలో అభ్యర్థులకు గుర్తుల ఏర్పాటు పరిశీలిస్తున్న కలెక్టర్

పనిపైశ్రద్ధ ఉంటే ఎప్పటికైనా న్యాయం

వంగూరు మే 6 : పనిపై శ్రద్ధతో తమ పని తాము చేసుకుని వెళ్తుంటే వారికి ఎప్పటికైనా న్యాయం జరుగుతుందని జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్ అన్నారు. ప్రభుత్వ దవాఖానలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పలువురు సిబ్బందికి రెగ్యులర్ కావడంతో వారికి వైద్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం సన్మానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు వెంకటదాస్, భీమానాయక్, వైద్యాధికారి శ్రుతి, సుధాకర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దాయాదుల మధ్య ఘర్షణ : వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్, మే 6 : దాయాదుల మధ్య ఘర్షణ ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటన నాగర్‌కర్నూల్ మం డలం గన్యాగుల గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. ఎస్సై గోవర్ధన్ కథనం మేరకు గ్రామానికి చెందిన గోనమోని మల్లయ్యకు అదే గ్రామానికి చెందిన చామల మల్లేశ్, బాలరాజు, రవిలకు గత కొన్ని రోజులుగా భూతగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం మల్లయ్యపై బాలరాజు ఇటుకతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతన్ని దవాఖానకు తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెద్దకొత్తపల్లి, మే 6 : భార్య కాపురానికి రావడం లేదని పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ గ్రామానికి చెందిన వనపట్ల జమదగ్ని సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు అతన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్యాభర్తలు ఘర్షణపడి భార్య వసంతా పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. దీంతో సోమవారం జమదగ్ని తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు భార్యకు సమాచారం ఇచ్చి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన ఎస్సై రాజు మూడు గంటల్లోనే నాగర్‌కర్నూల్ ఐటీ కోర్ టీమ్ సభ్యుల సహకారంతో జమదగ్నిని తిమ్మాజిపేట సమీపంలో ఉన్నట్లు గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. త్వరగా స్పందించిన ఎస్సై, సిబ్బందికి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్‌ఎంపీ నిర్వాకం.. వ్యక్తిమృతి

నాగర్‌కర్నూల్, మే 6 : ఆర్‌ఎంపీ నిర్లక్ష్యంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన తెలకపల్లి మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు తెలకపల్లి మండలం గౌరారం గ్రామానికి చెందిన మాడెం చిన్నరాములు(39) అనారోగ్యంతో తెలకపల్లిలోని సాయి క్లీనిక్ ఆర్‌ఎంపీ వద్ద సోమవారం చికిత్స నిమిత్తం వెళ్లాడు. రాములును పరీక్షించిన ఆర్‌ఎంపీ టైఫాయిడ్ జ్వరం ఉందని ఓ ఇంజెక్షన్ ఇచ్చి, సెలైన్ బాటిల్ ఎక్కించాడు. కొంత సమయం తర్వాత ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించింది. రాములు పరిస్థితి విషమించడంతో నాగర్‌కర్నూల్ సమీపంలోని గాయత్రి దవాఖానకు తీసుకెళ్లాలని సూచించారు. మార్గమధ్యలో చిన్నరాములు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆర్‌ఎంపీ పరారయ్యాడు. ఆర్‌ఎంపీ చేసిన నిర్వాకంతోనే రాములు మృతిచెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

భర్తపై గొడ్డలితో దాడిచేసిన భార్య

చికిత్సకు తరలిస్తుండగా మృతి

బిజినేపల్లి, మే 6 : మండలంలోని మమ్మాయిపల్లిలో మద్యం మత్తులో భర్తపై గొడ్డలితో దాడిచేసి హత్య చేసిన ఘటన సోమవారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు మమ్మాయిపల్లికి చెందిన నాగయ్య(48) తన భార్య లక్ష్మి సోమవారం గొడవపడ్డారు. మద్యం మత్తులో ఉన్న వారు ఘర్షణపడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈక్రమంలో లక్ష్మి తన భర్త నాగయ్యపై గొడ్డలితో దాడిచేసింది. గమనించిన స్థానికులు నాగర్‌కర్నూల్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో నాగయ్య మృతి చెందాడు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు సంతానం ఉన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు విచారణ చేపట్టనున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

మహిళకు గాయాలు

కొల్లాపూర్ రూరల్, మే 6 : కొల్లాపూర్ పట్టణంలోని బస్టాండ్ వద్ద జరిగిన ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు సోమవారం సాయంత్రం బస్టాండ్‌లోకి వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక టైర్లకింద చుక్కాయిపల్లి గ్రామానికి చెందిన మహిళ పడడంతో మోకాలు వరకు కాలు పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. అక్కడే ఉన్న స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. గాయ పడిన మహిళను కొల్లాపూర్ ప్రభుత్వ దవాఖానకు అంబులెన్స్‌లో తరలించారు. మహిళకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్..

కల్వకుర్తిరూరల్, మే 6 : ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ కల్వకుర్తి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగుతోంది. నియోజకవర్గంలో ఉద్యోగులపోస్టల్ బ్యాలెట్ ద్వారా మొత్తం 2,200 మంది దరఖాస్తు చేసుకోగా ఫెసిలిటేషన్‌పోస్టల్ బ్యాలెట్ ద్వారా 176 ఓట్లు శనివారం వరకు పోలయ్యాయి.

ఓటుహక్కును వినియోగించుకున్న అదనపు కలెక్టర్

నాగర్‌కర్నూల్, మే 6 : జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు వేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది, ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

పోస్టల్‌బ్యాలెట్‌లో ఓటు వేస్తున్న అదనపు కలెక్టర్

కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి కారుకు బైక్ ఢీ..

- ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం
- ఎమ్మెల్యే కాలుకి స్వల్పగాయాలు
- తలకొండపల్లి మండలం వెల్జాల్‌లో ఘటన

కల్వకుర్తి/కల్వకుర్తి రూరల్ మే 6 : ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రయాణిస్తున్న కారుకుబైక్ ఢీకొన్న ఘటనలో ఒకరుమృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదానికి సంబంధించి తలకొండపల్లి ఎస్ఐశ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి సోమవారం మధ్యాహ్నం తలకొండపల్లి మండలంలోని వెల్జాల్‌లో కార్నర్ మీటింగ్‌ను ముగించుకొని మిడ్జిల్ మండలంవైపు బయల్దేరాడు. ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారు తలకొండపల్లి-మిడ్జిల్‌వైపు వెల్జాల్ శివారులో రామసిపల్లి మైసమ్మ ఆలయం సమీపానికి రాగానే, అదే సమయంలో మిడ్జిల్ వైపు నుంచి ఇద్దరు వ్యక్తులతో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొన్నది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న తలకొండపల్లి మండలం వెంకటాపూర్‌కు చెందిన పబ్బతినరేశ్(25) అక్కడికక్కడే మృతిచెందగా, అదే గ్రామానికిచెందిన బైరవ పరశురాములుకి తీవ్ర గాయాలయ్యాయి. పరశురాములు పరిస్థితి విషమించడంతో చికిత్సనిమిత్తం అంబులెన్స్‌లో వెల్దండలో ప్రైవేట్ దవఖానకు తరలించారు. కారు ఎయిర్ బెలూన్‌లు ఓపెన్ కావడంతో ఎమ్మెల్యేతోపాటు డ్రైవర్ స్వల్ప గాయాలవ్వగా, కారులో ఉన్న పీఏ, గన్‌మెన్లు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద ఘటనపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ప్రమాదంలో గాయపడిన ఎమ్మెల్యే కశిరెడ్డికి కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానలో వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అనం తరం పార్టీశ్రేణులు మరో వాహనంలో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

నివాళులు అర్పిస్తున్న జైపాల్‌యాదవ్

బాధితులును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

రోడ్డు ప్రమాదంతో తీవ్రంగా గాయపడి వెల్దండ సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పరశురాములను మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరామర్శించారు. బాధితుని భార్య మంజులకు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నరేశ్ భౌతికకాయానికి ప్రభుత్వ దవాఖానలో నివాళులర్పించారు. నరేశ్ కుటుంబానికి రూ.10 కోట్లు ఆర్థికసాయం అందించాలని జైపాల్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఆయనవెంట మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, జెడ్పీటీసీ వెంకటేశ్, విజితారెడ్డి, ఎంపీటీసీ గుత్తి వెంకటస్వామి ఉన్నారు.